క్లుప్తంగా

చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలి

ఏలూరు (టూటౌన్): విజయవాడ గాంధీనగర్‌లోని సోమవారం నిర్వహించే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చేతివృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి వృత్తిదారులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు.

సినీ నటి జమున మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): ప్రముఖ సినీ నటి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సభ్యురాలు జమున మృతికి ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సమితి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. ప్రజానాట్యమండలిలో డాక్టర్ గరికపాటి రాజారావు నేతృత్వంలో రాజమండ్రి కేంద్రంగా సినీనటి జమున సభ్యత్వం తీసుకుని అనేక రాజకీయ, పౌరాణిక నాటికల్లో నటించిన కళాకారిణి అని ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బళ్ల కనక దుర్గారావు పేర్కొన్నారు. జమున మరణం సినీ రంగానికి, ప్రజానాట్యమండలికి తీరని లోటన్నారు. జమున మృతికి ప్రజానాట్యమండలి గాయకులు, కళాకారులు తమ్మ విశ్వేశ్వరరావు, పల్లె వెంకటనారాయణ సంతాపం తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె తాత్కాలిక వాయిదా

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీలలో జరుప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె వాయిదా పడిందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఏఐబీఈఏ జిల్లా అధ్యక్షులు దుగ్గిరాల శ్రీనివాసమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ బ్యాంక్‌ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ నెల 31న బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులను చర్చలకు ఆహ్వానించినందున సమ్మె వాయిదా వేశారని ఏఐబీఈఏ జాతీయ నాయకులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ చర్చల్లో బ్యాంక్ ఉద్యోగులకు న్యాయం జరుగకపోతే సమ్మె ఎప్పుడు చేసేది ప్రకటిస్తామని వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ మోహన్‌లు తెలిపారు.

హిందూ ధర్మపరిరక్షణకు అండగా సీఎం జగన్

- వేద పాఠశాల సమస్య పరిష్కరిస్తాం
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ
- నిర్వాహకులు, అధికారులతో సమీక్ష

ఏలూరు టౌన్: హిందూ ధర్మ రక్షణకు, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని, ఏలూరు వేద పాఠశాల సమస్యను త్వరలోనే సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. శ్రీరామ్ నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏలూరు పవర్‌పేటలోని శ్రీ కంచి కామకోటి పీఠ హేలాపురి సంస్కృత వేద ప్రయోగస్మార్త పాఠశాల సమస్యపై పాఠశాల నిర్వాహకులు, దేవదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఇటీవల ఏలూరు నగరంలో జరిగిన పరిణామాలను ఇరు వర్గాలు ఎమ్మెల్యే నానికి వివరించారు. అన్ని విషయాలను విన్న అనంతరం ఆయన మాట్లాడుతూ వేద పాఠశాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని స్పష్టం చేశారు. కానీ వేద పాఠశాల విషయంలో ఇది ఆక్రమణ, కబ్జా కాదని, ఎలాంటి లాభాపేక్ష, వ్యక్తిగత స్వార్థం లేకుండా కేవలం వేద పాఠశాల, గోశాల, హోమపూజలకు ఉన్న స్థలం సరిపోక వారు అడిగిన వినతిగానే చూడాలని ఎమ్మెల్యే నాని చెప్పారు. వేద పాఠశాల నిర్వహణకు అదనపు స్థలాన్ని అడిగిన తీరులో ఏదైనా తొందరపాటు జరిగి ఉండొచ్చు కానీ సంకల్పం ఎంతో గొప్పదన్నారు. ఇటువంటి వేదాలు, సంస్కృతి పరిరక్షణకు పాటుపడేవారు కనుమరుగు అవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో వేదం అభ్యసించే చిన్నారులకు అండగా నిలబడటం ప్రభుత్వ కర్తవ్యం అన్నారు. ఈ సందర్భంగా వేద పాఠశాల నిర్వాహకులు ఎమ్మెల్యే నానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, వేద పాఠశాల నిర్వాహకులు, దేవదాయ శాఖ అధికారులు, కృష్ణమాచార్యులు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.


ఏలూరులో వేద పాఠశాల నిర్వాహకులు, అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

వట్టి వసంత్ మృతి తీరని లోటు

- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి
- ఎంఎంపురంలో వట్టి వసంత్ పార్థివ దేహానికి నివాళులు

ఏలూరు టౌన్: రాజకీయాల్లో ఉన్నత విలువలు, ప్రజలకు సేవ చేయాలనే తపన, సేవాభావం కలిగిన రాజకీయ నేతల్లో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వట్టి వసంత్‌కుమార్ మృతి తీరని లోటని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అన్నారు. భీమడోలు మండలం పూళ్ల సమీపంలోని ఎంఎం పురం గ్రామంలోని స్వగృహంలో ఆయన పార్థివదేహానికి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదీర్ఘకాలంపాటు రాజకీయ నాయకునిగా, శాసనసభ్యునిగా, మంత్రిగా వట్టి వసంత్ కుమార్ ఎనలేని సేవలు అందించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా నేతగా పనిచేస్తున్న రోజుల్లో ఆయన ఎంతో సహాయ సహకారం అందిస్తూ ప్రతి విషయంలో అండగా నిలిచేవారని తెలిపారు. విశ్వసనీయత, ప్రజాసేవే పరమార్థంగా రాజకీయాలు చేస్తూ ప్రజల్లో అభిమానాన్ని చాటుకున్న గొప్ప నాయకులన్నారు.

వట్టి వసంత్ మృతికి పలువురి సంతాపం

ఏలూరు (టూటౌన్): మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ మృతికి పలువురు నాయకులు, పార్టీలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని వ్యక్తం చేశాయి. సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరుపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రవి సంతాపాన్ని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వట్టి వసంత్ కిడ్నీ మార్పిడితో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, విశాఖపట్టణంలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారన్నారు. జిల్లాలోని భీమడోలు మండలం పూళ్ల సమీపంలోని ఎంఎం పురం ఆయన స్వగ్రామంగా పేర్కొన్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. వసంత్ కుమార్ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కె.రోశయ్య, ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారన్నారు. మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ సంతాపం తెలిపారు. మంత్రిగా మచ్చలేని నాయకునిగా వట్టి వసంత్ గుర్తింపు పొందారన్నారు. జీవితంలో అవినీతి అనే మాటకు తావు లేకుండా నిజాయతీగా జీవితాన్ని గడిపారన్నారు. వసంత్ కుమార్ మృతికి కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు సంతాపం ప్రకటించారు. వట్టితో కలిసి తాను కాంగ్రెస్ పార్టీలో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


వట్టి వసంత్ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం


ఆశ్రం వద్ద రోడ్డు మార్జిన్‌లో వెలసిన దుకాణాలు


ఆశ్రం వద్ద ఆక్రమణదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిషోర్

- ఆశ్రం ఆస్పత్రి వద్ద రోడ్డు మార్జిన్లలో ట్రాఫిక్‌కు ఆటంకంగా దుకాణాలు
- కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణలను పరిశీలించిన అధికారులు
- అప్పటికప్పుడు దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్: ఆశ్రం ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్డీఓ కె.కిషోర్ పర్యవేక్షణలో ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్, ఈఓపీఆర్డీ ఎం.సరళ కుమారి శనివారం సిబ్బంది, పోలీసులతో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. ట్రాన్స్‌కో అధికారులతో చర్చించి దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. అనంతరం ఆక్రమణదారులను పిలిచి ప్రశ్నించారు. కొంతకాలంగా ఆశ్రం వై-జంక్షన్ పరిసరాల్లో కొంతమంది రోడ్డు పక్కన షెడ్లు నిర్మించి హోటల్, కిరాణమాల్ పేరుతో వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారం పెరగడంతో క్రమేపీ రోడ్డు మార్జిన్ సైతం ఆక్రమించి షెడ్లను పెద్దవిగా మార్చారు. ఈ దుకాణాల వద్ద వినియోగదారులు ద్విచక్రవాహనాలు, కార్లు నిలిపివేస్తుండటంతో బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆక్రమణలను పరిశీలించారు. షెడ్ల వెనక గోదావరి కెనాల్‌ను సైతం ఆక్రమించి తడికలతో మెరక చేసినట్టు గుర్తించారు. సోమవారం ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆర్డీఓ పాలగూడెం గ్రామాధికారులను ఆదేశించారు.

ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్రం

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు విమర్శించారు. పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ ప్రాంత కార్యకర్తల జిల్లా సమావేశం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంట్ చార్జీలు పెంచిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి విభజన హామీలు అమలు చేయకుండా మోసం కేంద్రం చేసిందన్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, నాయకులు హనుమానులు, సూర్యారావు, ఆర్‌వీఎస్ నారాయణ, పి.హైమావతి, పద్మాంజలి, జి.సూర్యకిరణ్, కె.లెనిన్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

పాడి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ఏలూరు (టూటౌన్): గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో ఈనెల 31న ఉదయం 10 గంటలకు పాడి రైతుల రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. పవరుపేటలోని అన్నేభవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ జరగుతున్న ఈ సదస్సుకు జిల్లా నుంచి పాడి రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దాణా ఖర్చులు పెరిగిపోయినందున పాలకు గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారన్నారు. చనిపోయిన ఆవులు, గేదెలకు బీమా పరిహారం అందించాలని, వివిధ రోగాల కారణంగా పాలదిగుబడి తగ్గిపోతోందని, రోగాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు చెల్లించాలన్నారు. పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సులో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	66
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	26	ములక్కాడలు	12-15
బెండకాయలు	54	కంద	36
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	34
కాకర కాయలు	22-28	కీరా దోస	46
బీరకాయలు	48-60	ఫ్రెంచ్‌బీన్స్	50
బీరకాయలు (పందిరి)	50	అల్లం	68
క్యాబేజీ	34	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	60
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ప్రజారోగ్యానికి ఐదు శాతం నిధులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని, మందులపై జీఎస్టీ ఎత్తి వేయాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ జీవీడీ కృష్ణ కోరారు. స్థానిక పవరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ వార్షిక సభ ఏలూరు బ్రాంచి యూనియన్ అధ్యక్షులు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యం అందుబాటులో తీసుకునిరావడంలో వైఫల్యం చెందిందన్నారు. కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రజల్లో భయాందోళనలు నెలకొనడంతో ప్రైవేటు ఆస్పత్రులు, ఫార్మా కంపెనీలు దోచుకుంటున్నాయని విమర్శించారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ అధ్యక్షులు రవిచంద్ర, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ఎంవీ సదాశివరావు మాట్లాడారు. యూనియన్ కార్యదర్శి సీహెచ్ సీతయ్య, ఉపాధ్యక్షులు వై.దుర్గారావు, ఎం.ఉమామహేష్, పీసీహెచ్ సురేష్, ఎస్‌కే మొహిద్దీన్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌జీవీడీ కృష్ణ

గృహసారథులు అంకితభావంతో సేవలందించాలి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, అభివృద్ధికి క్షేత్రస్థాయిలో గృహసారథులు కీలకమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు నివాసంలో నిర్వహించిన సమావేశంలో కామిరెడ్డి నాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి మంచి పేరు తీసుకువచ్చేలా వలంటీర్లు, గృహసారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. సమన్వయంతో పార్టీ నియమనిబంధనలకు లోబడి సేవలందించాలన్నారు. దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత మాట్లాడుతూ గృహసారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, తాళ్ళూరి నాగరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగర రత్నకుమార్ అబ్బాస్, జిల్లా కార్యదర్శి చల్లా మేరీరాజు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షులురాలు తొత్తడి వేదకుమారి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, నాయకులు గొరిపర్తి శ్రీనివాసరావు, పులిపాటి శ్యామలాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.


దెందులూరులో వైఎస్సార్‌సీపీ గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న పోకల రాంబాబు

పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి భూమిపూజపై హర్షం

ఏలూరు (టూటౌన్): ఏలూరులో వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని భూమిపూజ చేయడంపై వైఎస్సార్ సీపీ నాయకులు పొలిమేర హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గన్‌బజార్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ నాయకులు, ఎస్సీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరును ఆళ్ల నాని హయాంలోనే కార్పొరేషన్‌గా మార్పు చేశారన్నారు. అలాగే నియోజకవర్గంలో అనేక శాశ్వత కట్టడాలు, అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం ప్రాంతంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నిర్మాణం ద్వారా ఆ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో గూడవల్లి శ్రీనివాస్, మందపాటి నవీన్, బి.రామకృష్ణ, కటారి నాగేశ్వరరావు, గంటాటి రమేష్, కటారి రాజేష్, నేదూరి ఎల్లయ్య, ఎం.సత్యం, వి.జయరాజు, పెనుమూలూరి రామారావు, పొలిమేర రాజు పాల్గొన్నారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ బోర్డు ద్వారా అమలయ్యే పథకాలను కొనసాగించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రమణారావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు కోరారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. ఈ నిధులను ఇతర అవసరాలకు మళ్లించ వద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మళ్లించిన నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలని కోరారు. బిల్డింగ్ కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో ఏపీ భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి కేవీ గోపాలరావు, ఎం.సుందర్‌బాబు, ఎర్ర రాంబాబు, పిల్లి నరసింహారావు, మందా సూరిబాబు, పి.అనసూయమ్మ, వల్లేపల్లి నరసింహామూర్తి, రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మణారావు

విద్యార్థికి ప్రతిభా పురస్కారం

పెదపాడు: విద్యాభ్యాసంలో అత్యుత్తమ ప్రతిభకనపర్చిన కొలిశెట్టి నాగేంద్రబాబుకు అప్పనవీడు మానవత శాఖ తరుపున ఆదివారం రూ.25వేల ప్రతిభా పురస్కారాన్ని అందించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో మానవత అధ్యక్షుడు చక్కా సుబ్బారావు అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. మానవత చైర్మన్, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా రూ.25వేల నగదు పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ఆదివారం అందించారు. దీంతోపాటు నాగేంద్రబాబు తల్లిదండ్రులను ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం పంచాయతీలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ టి.భూపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ వైద్యులు పి.రామకృష్ణ, పిల్లల వైద్య నిపుణులు పి.రవీంద్రబాబు, గైనకాలజిస్ట్ డా.భవ్య, కంటి వైద్య నిపుణులు కె.సురేంద్రబాబు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్ డా ఎ.సత్యన్నారాయణ, చైర్మన్ ఎ.అప్పారావు, వైస్ చైర్మన్ ఎం.శామ్యూల్, అధ్యక్షుడు కె నాగచిన్నారావు, బీవీఎస్ఎస్ రాజు, ఎం.సత్తిబాబు, పి.సోమశేఖర్, ఎం.సత్తిబాబు, పి.సోమశేఖర్, కె.గాంధి, కృష్ణారెడ్డి, కె. సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు అందుబాటులో ఆధునిక చికిత్స


లెప్రసీ సెంటరులో మాట్లాడుతున్న ఫిజియో థెరపిస్ట్ రాంబాబు

దెందులూరు: కుష్ఠువ్యాధిగ్రస్తుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు, వారి మెరుగైన జీవన విధానానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఫిజియోథెరిఫిస్ట్ డాక్టర్ రాంబాబు, డామియన్ లెప్రసీ సెంటర్ సిస్టర్ రోజీ అన్నారు. ఆదివారం వేగవరం డామియన్ లెప్రసీ సెంటరులో ప్రపంచ లెప్రసీడే సందర్భంగా సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం సాంకేతిక నిపుణుల బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వారన్నారు. కుష్టు వ్యాధి చికిత్స కోసం మందులు, ఆధునిక చికిత్సా విధానం అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రష్మిత, అకౌంటెంట్ నాగరాజు, జయలక్ష్మి పాల్గొన్నారు.